## మలేరియాతో గిరిజన విద్యార్థి మృతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండలంలోని దొరజమ్ము గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థి కొండగొర్రి దినేష్ మలేరియాతో మృతి చెందాడు. జియ్యమ్మవలస మండలం పల్లపుసిరిసి గ్రామానికి చెందిన దినేష్ దొరజమ్ములో చదువుతున్నాడు. ఐదు రోజులుగా విశాఖపట్నంలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విద్యార్థి దినేష్ గత అక్టోబర్ నెలాఖరు నుంచి పాఠశాలకు రావడం లేదని, ఆయన అనారోగ్యం గురించి తల్లిదండ్రులు చెప్పలేదని సహాయ గిరిజన సంక్షేమ అధికారి సురేష్ కుమార్ చెప్పారు.

దినేష్ (ఫైల్)

### గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో

# అడ్డగోలు నియామకాలు



CHILDREN'S DEVELOPMENT EDUCATIONAL CHANGING ASSOCIATOR

www.cdecassociator.com

Date: 07.10.2024

To

The Head master,
GTWA School ,G.Sivada,Kurupam (M),

Dear Kondagorri Vijaya Kumar

We are pleased to offer you an appointment for the position of Attender at GTWA SCHOOL We believe that your qualifications, experience and dedication will makea valuable contribution to the zphs school students on behalf of the Children's Development Educational Changing Associator under NSDC. We are delighted to welcome you as part of the CDEC Associator, school attender team under NSDC.

The terms and conditions of your appointment below:

1.Appointment validity :You will have to join on 7th October 2024 and offer stands withdrawn in case does not join on Date of joining and your appointment will be valid till 16th October 2024

1.1,Posted: You will initially be posted at GTWA School (28120302905) G.Sivada , Kurupam Mandal, Manyam

1.2,Position: Your role will be Attender and you will report to [Coordinator].Your primary responsibilities include CDEC Associator & NSDC

1.3,Honorarium: Your initial Honorarium will be Rs. 14,500/- per month paid on a CSR Frequency basis.

1.4,Working Time: Your regular working time are from 9:00AM to 4:35PM on school Working Days. Please be aware that you are expected to adhere to the school's calendar, attend all mandatory meetings and events, and actively participate in the school's extracurricular activities.

1.5, Probationary Period: You will undergo a probationary period of 3 months Duration, during which your performance and compatibility with the position will be assessed.

2.Termination:Renewal o your employment with the CDEC Associator will be doneon a continuous basis as per the NSDC conditions with an extension every two years in writing depending on the need of the school attnder

2.1,On the termination of your employment for whatever reason you will return to the CDEC Associator all property document and paper both original and copies thereof, including any samples literature, contacts records, lists, drawings, blueprints letters notes data and the link and confidential information shall also deliver to the immediately all working papers relating thereto.

3.Code of conduct:Being appointed as a attnder on behalf of a CDEC Associator under NSDC, you must abide by the code of conduct of your assigned school

+08676835482 cdecassociator@ Plot no:14 and 15,Komma ramu street,Prasadampadu,Saibaba temple line, Currency nagar,Vijayawada,Andhrapradesh - 521108

చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ చేంజింగ్ అసోసియేటర్ అనే సంస్థ పేరుతో జారీచేసిన అపాయింట్‌మెంట్ లెటర్

ప్రజాశక్తి-పార్వతీపురం

**ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అడ్డగోలు నియామకాలు జరుగుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ యువతే లక్ష్యంగా కొంతమంది ఉద్యోగాల పేరుతో ఎర వేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగమనే ఆశతో లంచాలు ఇవ్వడానికి నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో కొన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అటెండర్ ఉద్యోగాలను భర్తీ చేస్తూ కొన్ని ఏజెన్సీలు నియామక ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ ఏజెన్సీ సంస్థలు బ్రోకర్ల ద్వారా ఒక్కో ఉద్యోగానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.**

- నిరుద్యోగులకు అటెండర్ ఉద్యోగాల ఎర
- రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసిన ఏజెన్సీలు
- ఐటిడిఎకి తెలియకుండా భర్తీ?

కురుపాం మండలం జి.శివడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అటెండర్‌ను నియమిస్తూ చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ చేంజింగ్ అసోసియేటర్ అనే సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ కార్యాలయం విజయవాడలో ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. గుమ్మలక్ష్మీపురం జిడబ్ల్యుటిపిఎం పాఠశాలలో కూడా వాలంటీర్ అటెండర్ పేరుతో శ్రీ ఎల్లమాంబ సర్వీస్ అనే సంస్థ ఉద్యోగ నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సంస్థ విశాఖపట్నానికి చెందినదిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పది, ఇంటర్మీడియట్ చదివిన గిరిజన నిరుద్యోగ యువతే లక్ష్యంగా ముక్కూ మొహం తెలియని ఏజెన్సీలు ఉద్యోగాల వల విసురుతున్నాయి. ఈ బోగస్ ఉద్యోగ నియామక ఏజెన్సీలు తమ ఏజెంట్ల ద్వారా నిరుద్యోగ యువకుల నుంచి డబ్బులు వసూలు చేసి, ఉద్యోగ నియామక పత్రాలు జారీ చేస్తున్నాయి. ఒకవేళ థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా ఎలాంటి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకం చేపట్టినా ఐటిడిఎ అధికారుల ద్వారా జరగాల్సి ఉంది. అయితే ఇప్పుడు చేపడుతున్న నియామకాల గురించి తమకేమీ తెలియదని ఐటిడిఎ అధికారులు చెబుతున్నారు.

### విచారణ చేపట్టాలి

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన నిరుద్యోగ యువతే లక్ష్యంగా కొన్ని సంస్థలు ఉద్యోగాల భర్తీ చేపడుతున్నాయి. ఇప్పటికే కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో కొన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అటెండర్ ఉద్యోగాల భర్తీ చేపడుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒక్కో ఉద్యోగానికి రూ.2 లక్షల నుంచి 3 లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. అక్రమ ఉద్యోగాల దందాపై జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలు సమగ్ర విచారణ చేపట్టాలి. నియామక ఉత్తర్వులు జారీ చేసిన సంస్థలపై చర్యలు తీసుకోవాలి.

– పి.రంజిత్‌కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

# దళారుల మాట వినొద్దు

### కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ● ధాన్యం కొనుగోలు పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

జిల్లాలో పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రైతులకు హామీఇచ్చారు. దళారుల మాటలు విని మోసపోవద్దని కోరారు. బుధవారం సీతానగరం మండలం అంటిపేట గ్రామంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబికతో కలిసి కలెక్టర్ పర్యటించారు. అక్కడ రైతులతో ధాన్యం కొనుగోళ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతుకు అవసరమైన గన్నీ బ్యాగులు, రవాణా, హమాలీ సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. రైతులు ధాన్యం విక్రయించినట్లు రశీదు అందజేస్తామని, రశీదు ఇచ్చిన 48 గంటల్లోగా రైతుల ఖాతాలో నగదు జమ అవుతుందని కలెక్టర్ వివరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. రైతులు ఇచ్చిన కొలత మేరకే మిల్లర్లు తీసుకోవాలని, అధికంగా వసూలు చేస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అల్పపీడన ద్రోణితో జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉండవచ్చని, పండించిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకొని, సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని కోరారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీలు**

మండలంలోని గుచ్చిమి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెసి ఎస్.ఎస్. శోబిక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను ఆమె పరిశీలించారు. ఎఒ, విఎఎ, రైతు సేవా కేంద్రం సిబ్బందికి పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై మిల్లర్లు, సంబంధిత అధికారులతో జెసి సమీక్షించారు.

సీతానగరం.. రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

**రైతులకు గోనె సంచులు అందించాలి**

రైతులకు సకాలంలో గోన్ సంచులు అందించాలని ఎపి రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, బోరపరెడ్డి అప్పారావు, బి.నారాయణస్వామి, ఆర్.ఈశ్వరరావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జెసి శోబికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైతులకు గోనె సంచులు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్నారు. రవాణాకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతుల వద్ద నుంచి మిల్లర్లు బస్తాకు 4 కిలోల వరకు అదనంగా తీసుకుంటున్నారని తెలిపారు.

బలిజిపేట.. మిల్లర్లతో మాట్లాడుతున్న జెసి శోబిక

### రైతులను ఇబ్బంది పెట్టకూడదు

**బలిజిపేట :** ఏ ఒక్క కారణంతోనైనా రైతులు ఇబ్బంది పడకూడదని జాయింట్ కలెక్టర్ శోబిక అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మిల్లర్లు, కస్టోడియన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు దగ్గర నుండి రైతు ఖాతాలో డబ్బులు జమ అయ్యేవరకు ఏ అధికారైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ విధానాల వల్లే

# చెరకు రైతు కుదేలు

### సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రభుత్వ విధానాల వల్లే చెరకు రైతులు కుదేలయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లచ్చయ్యపేట చెరకు ఫ్యాక్టరీని తెరిపించి రైతులను, కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చెరకు ఫ్యాక్టరీ మూతపడటంతో రైతులు కుదేలయ్యారని, కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్‌సిఎస్ యాజమాన్యం చర్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు నష్టపోయి చెరకు సాగు తగ్గించారని చెప్పారు. 16 వేల ఎకరాల్లో సాగు చేసే చెరకు పంట.. 3 వేల ఎకరాలకు తగ్గిందని చెప్పారు. గత ప్రభుత్వం ఫ్యాక్టరీ యజమాని వైపు కొమ్ము కాయడంతో ఫ్యాక్టరీ మూత పడిందన్నారు. ఫ్యాక్టరీ తెరిపించాలని పోరాడిన రైతులు, సిపిఎం నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫ్యాక్టరీ ఆస్తినంతా తెగనమ్మి రియల్ ఎస్టేట్‌గా మార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు చెరకుపై నమ్మకం లేకుండా చేశారని చెప్పారు. రైతులు వరి పంటపై మరలడం, దీనిపై పెట్టుబడులు పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ ప్రాంతంలో రైతులంతా దివాళా తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో టిడిపి తరపున పోటీ చేసిన అభ్యర్థులను గెలిపిస్తే ఫ్యాక్టరీని తెరిపించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తెరిపించేందుకు స్థానిక ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు.

### పసుపు-కుంకుమ భూమి కోసం

# కన్నతండ్రి కక్కుర్తి

### భూ రికార్డులు మార్చి కాజేసేందుకు ప్రయత్నం ● తండ్రి అన్యాక్రాంతంపై కుమార్తె ఫిర్యాదు

ప్రజాశక్తి-మక్కువ

**ప్రపంచీకరణ పుణ్యమా అని ఆస్తి కోసం పేగుబంధాన్ని కూడా దూరం చేసుకుంటున్న రోజులివి. కుమార్తె.. ఆడ పిల్ల కానీ, ఈడ పిల్ల కాదుగా.. అన్న ధోరణిలో పసుపు కుంకుమ కింద రాసిచ్చిన భూమిని సైతం లాక్కొనేందుకు అడ్డదారులు తొక్కాడో తండ్రి. అది కూడా తండ్రి ఇచ్చిన ఆస్తి కాదు. కూతురికి తల్లి రాసిచ్చిన ఆస్తిని రికార్డులు మార్చి, కాజేయాలని పన్నాగం పన్నాడు. అందుకోసం రాజకీయ అండదండలతో భూమిని రికార్డులు మార్చి అన్యాక్రాంతానికి ఒడిగట్టాడు. దీనికి కుటుంబ బంధాలు, అనుబంధాలు భారంగా మారడం ఒకింత కారణమైతే, భూముల ధరలకు రెక్కలు రావడం తండ్రి అత్యాశకు మరో కారణంగా చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో కన్నకూతురు తండ్రిపై బుధవారం స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీమ్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే...**

ఫిర్యాదును పరిశీలిస్తున్న తహశీల్దార్ ఇబ్రహీం

మక్కువ మండలంలోని కోన గ్రామానికి చెందిన శంకరాపు లక్ష్మణరావు కుమార్తె శోభ. ఆమెకు పాచిపెంట మండల కేంద్రానికి చెందిన వెంపటాపు సంతోష్‌కుమార్‌తో 2016లో వివాహమైంది. ఈ నేపథ్యంలో తాతయ్య వారసత్వంగా వచ్చిన ఆస్తిని శోభకు తల్లి పార్వతి రాసిచ్చింది. పసుపు – కుంకుమ కింద 2.10 ఎకరాల భూమిని 2022లో శోభ పేరిట రిజిస్ట్రేషన్ చేసింది. లక్ష్మణరావు.. శోభ తాత ఇంటికి ఇల్లరికపు అల్లుడిగా వచ్చాడు. శోభ పిన్నిని కూడా లక్ష్మణరావు అనధికారంగా వివాహం చేసుకున్నాడు. రెండేళ్ల క్రితం శోభకు ఇచ్చిన భూమిని ఇటీవల జరిగిన రీసర్వేలో లక్ష్మణరావు రాజకీయ అండదండలు ప్రదర్శించి, రికార్డులను తారుమారు చేసి కాజేసేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం తెలిసిన శోభ.. అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కలెక్టర్ స్పందించి భూమిని అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఆమెకు నేటికీ అప్పగించలేదు. సిఐ సమక్షంలో ఇరువురిని పిలిచి, గొడవలు వద్దని చెప్పినా, భూమి వద్దకు వెళ్లిన వెంటనే కొట్టడానికి, చంపడానికి సిద్ధమవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన బాధిత మహిళ శోభ.. బుధవారం స్థానిక తహశీల్దార్ ఇబ్రహీమ్‌ను కలిసి, ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా తన భూమిని అప్పగించాలని, ఆ భూమి వద్దకు వారిని వెళ్లనీయకుండా చూడాలని ఆమె కోరారు. దీంతో తహశీల్దార్ స్పందిస్తూ వారం రోజుల్లో రికార్డు పరిశీలించి, సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, ఎపి రైతు సంఘం నాయకులు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ డిఎహెచ్‌ఒకు 23 వినతులు

**పార్వతీపురం :** డయల్ యువర్ డిఎహెచ్‌ఒకు 23 వినతులు అందాయని జిల్లా పశు సంవర్థక అధికారి శివ్వాల మన్మథరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి డయల్ యువర్ డిఎహెచ్ఒ (జిల్లా పశు సంవర్థక అధికారి) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 23 మంది రైతులు వారి సమస్యలను తెలియజేశారు. ప్రభుత్వం అందజేసిన టిఎంఆర్‌తో పాల దిగుబడి గణనీయంగా పెరిగిందని, సబ్సిడీతో కూడిన టిఎంఆర్, మిశ్రమ దాణాను ఏడాది మొత్తం సరఫరా చేయాలని పలువురు రైతులు కోరారు. గోకులాల షెడ్లు మంజూరు చేయాలని పలువురు రైతులు విన్నవించారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎడి కె.ప్రసాదరావు, బి.శ్రీనివాసరావు, బి.చక్రధర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిఎహెచ్ఒ మన్మథరావు

### జెజెఎం పనులు పూర్తిచేయకుంటే

# ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

### అధికారులకు ఆదివాసీ గిరిజన సంఘం హెచ్చరిక

ప్రజాశక్తి-సీతంపేట

జల జీవన్ మిషన్ పనులు 15 రోజుల్లోగా పూర్తిచేయకుంటే పాలకొండలోని ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, బి.అప్పారావు, జె.శ్రీరాములు అధికారులను హెచ్చరించారు. బుధవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పాలకొండ నియోజకవర్గంలో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా నీరు ఇచ్చేందుకు రూ.100 కోట్ల విలువైన 500కు పైగా పనులు ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయ్యాయని చెప్పారు. 25 శాతం పనులు పూర్తి చేశారని, 50 శాతం పనులు సాగుతున్నాయని, మిగతా పనులు ప్రారంభించనే లేదని తెలిపారు. దీనివల్ల గిరిజనులు తాగునీటికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పనులను పర్యవేక్షిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకోవడం మండిపడ్డారు. నియోజకవర్గంలో 75 గ్రామాల్లో కలుషితనీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. వెంటనే పనులు ప్రారంభించి, 15 రోజుల్లో పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

రహదారిపై యువకుడి మృతదేహం వద్ద బైఠాయించిన గ్రామస్తులు

# లారీ ఢీకొని యువకుడు మృతి

### రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని గుమడ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. గుమడ గ్రామానికి చెందిన దేవుపల్లి భాస్కరరావు (28) పశువులు తోలుకెళ్తున్నాడు. విశాఖపట్నం నుంచి రాయగడ వైపు వెళ్తున్న లారీ ఆయన్ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం లారీ నిలుపుదల చేయకుండా డ్రైవర్ అతి వేగంగా ముందుకు వెళ్లిపోయాడు. పోలీసులు స్పందించి కొమరాడ గ్రామ సమీపంలో లారీని అడ్డగించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తంచేసిన గుమడ గ్రామస్తులు, భాస్కరరావు కుటుంబ సభ్యులు అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించారు. ఈ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వాహన తనిఖీలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ మృతదేహాన్ని తరలించబోమని తేల్చిచెప్పారు. సుమారు మూడు గంటల పాటు రెండు వైపులా రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ నీలకంఠం ఘటనా స్థలానికి చేరుకొని వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వారు ససేమీరా అనడంతో పార్వతీపురం సిఐ ఎస్.గోవిందరావు.. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి లారీ యజమాని నుంచి నష్టపరిహారం, ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెల్లించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### అవుట్ సోర్సింగ్ టీచర్లకు

# మినహాయింపు ఇవ్వాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ● అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల దీక్షలకు మద్దతు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను డిఎస్‌సి నుంచి మినహాయించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఐటిడిఎ కార్యాలయం వద్ద గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజుకు చేరాయి. బుధవారం ఈ దీక్షా శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వి.ఇందిర, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన డిమాండ్లు ఆమోదించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ మద్దతుగా దీక్షల్లో కూర్చున్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు కామేష్, ఉమామహేశ్వరావు, గంగరాజు, హరిబాబు, షర్మిల, బిందుమాధవి, ఉషారాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం.. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

సీతంపేట.. దీక్షలో పాల్గొన్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

### ఉపాధ్యాయులు లేకుండా చదువు సాగేదెలా?

**పార్వతీపురం :** గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు నిరసన చేపడుతుంటే చదువులెలా సాగుతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు ప్రశ్నించారు. ఈ మేరకు ఐటిడిఎ ఎపిఒ మురళిని ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వారం రోజులుగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు దీక్షలు చేస్తున్నారని, కనీసం ఉన్నతాధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొందని చెప్పారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఈరోజు ఐటిడిఎ ఎదుట దీక్షలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీని వల్ల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను సిఆర్‌టిలుగా నియమించాలని, వారి సమస్యను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట :** గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఐటిడిఎ గేటు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగుతున్నాయి. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు ఒబాయోగి అన్నారు ఈ శిబిరానికి సంఘీభావం ప్రకటించారు.

## ఉత్తమ పాఠశాలకు అవార్డు

**పార్వతీపురం :** డిసెంబర్ 7న ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఎంపిడిఒలను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ పాఠశాలకు అందిస్తామని చెప్పారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపిడిఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలని, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మన బడి మన తోట, శాస్త్ర విజ్ఞాన ప్రయోగశాలలు, మైదానం, తరగతి గదులు, వంట గదులు తదితర అంశాలను తల్లిదండ్రులకు చూపించాలని సూచించారు. రంగోలి, టగ్ ఆఫ్ వార్, వాలీ బాల్, టెన్నికాయిట్ తదితర ఆటలు తల్లిదండ్రులకు నిర్వహించాలని చెప్పారు.

## అభివృద్ధి పనులు వేగవంతం

**పార్వతీపురం :** ఆశావాహ బ్లాక్‌గా ఉన్న భామిని మండలంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు వేగవంతం కావాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆశావాహ బ్లాక్‌లో పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ఇప్పటి వరకు ఉన్న ప్రగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ప్రగతి అనుకున్న లక్ష్యాలు సాధించడంలో ఆశాజనకంగా లేదని హెచ్చరించారు. మందకొడి పనులు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆశావాహ బ్లాక్ ఇన్ ఛార్జ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీడి రైతులకు భరోసా కల్పించాలి

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో జీడి సాగు చేసే గిరిజన రైతులకు ప్రభుత్వం, ఐటిడిఎ భరోసా కల్పించాలని గిరిజన సంఘం నాయకులు బి.మధు, స్వామి నాయుడు, చింతామణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దశాఖ గ్రామంలో జీడి తోటలను బుధవారం సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని 8 మండలాల్లో సుమారు 52 వేల ఎకరాల్లో జీడి సాగవుతోందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో జీడి రైతులకు ప్రభుత్వం ఎటువంటి భరోసా కల్పించకపోవడంతో దళారులకు అమ్ముకొని నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. జీడి ఫ్యాక్టరీని కురుపాం నియోజకవర్గంలో నిర్మిస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జీడి రైతులకు ఉద్యానశాఖ, ఐటిడిఎ అధికారులు సలహాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి-వీరఘట్టం

తుపాను ప్రభావం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, కోత కోసిన పంటను కుప్పలుగా వేసి టార్పాలిన్ కప్పాలని మండల వ్యవసాయ అధికారి సౌజన్య సూచించారు. బుధవారం మండలంలోని ఆడరు, వండువ, బిటివాడ, తదితర గ్రామాల్లో పర్యటించి, రైతులకు అవగాహన కల్పించారు. వరికోతలను రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు.

**సీతంపేట :** జిల్లాలో ఈనెల 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. పొలంలో వరి పనలు ఉంటే వెంటనే కుప్పలు పెట్టుకొని, టార్పాలిన్లతో కప్పాలని సూచించారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కొమరాడ మండలం కుమ్మరిగుంట గ్రామానికి చెందిన ఎత్రాజుల విజయలక్ష్మికి సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును బుధవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అందజేశారు. విజయలక్ష్మి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో ఆమెకు సిఎం సహాయనిధి నుంచి రూ.2.07 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును ఆమెకు ఎమ్మెల్యే అందించారు.

## ప్రభుత్వ అధ్యాపకుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులుగా బి.రాజు (పాలకొండ), కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు (సాలూరు) ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శిగా బి.మంజుల (సీతంపేట), ట్రెజరర్‌గా ఆర్.తేజేశ్వరరావు (వీరఘట్టం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## రామారావుకు సత్కారం

ప్రజాశక్తి-మక్కువ

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎ.వెంకంపేట హైస్కూల్ ఉపాధ్యాయులు గొంగాడ రామారావును టిడిపి మండల అధ్యక్షులు జి.వేణుగోపాల్ నాయుడు సత్కరించారు. బుధవారం ఎ.వెంకంపేట గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రామారావు గ్రామానికి కూడా రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చారని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవి, టిడిపి నాయకులు పి.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వంద పనిదినాలు కల్పించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

ప్రతి ఇంటికీ వంద పని దినాలు కల్పించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ క్షేత్ర సహాయకులను ఆదేశించారు. బుధవారం క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గుర్తించిన పనులకు అంచనాలు తయారు చేయాలని సూచించారు. పల్లె పండుగ పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇంజనీరింగ్ కన్సల్టింగ్ వి.కృష్ణప్రసాద్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎన్నికల సీనియర్ సహాయకులు కాంతారావు బుధవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎన్. మురళి, రామ్మోహనరావు పాల్గొన్నారు.

**పాలకొండ :** 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరుగా చేర్పించాలని తహశీల్దార్ పి.బాలమురళీకృష్ణ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. టీచర్ ఎమ్మెల్సీ ఓట్లు 253 నమోదు అయ్యాయన్నారు. ఆయనతో పాటు డిటి సన్యాసిరావు ఉన్నారు.

చేపపిల్లలను విడుదల చేస్తున్న పిహెచ్‌ఒ గణేష్

## చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని చింతాడ, మోహన్ కాలనీ, తుంబన్న కాలనీ, చిన్నబగ్గ, నాగులుగూడ, బొండి తదితర గ్రామాల్లో 36 మందికి 43,400 చేపపిల్లలను ఐటిడిఎ నిధులతో బుధవారం పిహెచ్‌ఒ ఎస్‌వి గణేష్, గోరపాడు సర్పంచ్ నీలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో 944 చెరువులకు రూ.39.62 లక్షలతో 26,59,336 చేప పిల్లల పంపిణీని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారతీ రాజ్, చింతాడ సర్పంచ్ ఆనప, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ నిమ్మక విజేత, ఆదినారాయణ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

ప్రజాశక్తి-వీరఘట్టం

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు పాలకొండ అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ జామి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో 08941260111, 9553918425, టోల్ ఫ్రీ 101 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సుంబోరా, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి-సీతంపేట

యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కావద్దని ఎస్ఐ వై.అమ్మన్నరావు కోరారు. సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, భద్రత గురించి వివరించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుశాంత్ జానా, బోధకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువపత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. బుధవారం కురుపాం సబ్‌స్టేషన్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ నరసింహులు, సిబ్బంది ఎల్.ఎన్.దొర, అశిరయ్య పాల్గొన్నారు .

## నేడు వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు ఎంపిడిఒ కె.రూపేష్ తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన వికలాంగులు ఆధార్ కార్డులు, సదరం ధ్రువపత్రంతో హాజరుకావాలని సూచించారు. వారికి అవసరమైన ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, వివిధ రకాలైన ఉపకరణాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని గుణానపురంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి సకాలంలో నగదును రైతులు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. అనంతరం రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని జెండా ఊపి ట్రాక్టరును మిల్లర్లకు పంపించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, తహశీల్దార్ శివయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి పి. శంకరరావు, టిడిపి మండల అధ్యక్షులు ఎస్.శేఖర్ పాత్రుడు, తెలుగు రైతు అరకు పార్లమెంట్ అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, ఎంపిటిసి సభ్యులు సంతోషి, గంట వెంకట్ నాయుడు, నాయకులు సుదర్శన్ రావు, మధుసూదన్ రావు, పి.వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

**సాలూరు రూరల్ :** మండలంలోని మామిడిపల్లి పిఎసిఎస్ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఒ అనురాధ పండా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం మిల్లుకు వెళ్లిన 48 గంటల్లో రైతుల అకౌంట్‌లో డబ్బులు జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, డిప్యూటీ తహశీల్దార్ రంగారావు, టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, తెలుగు రైతు మండల అధ్యక్షుడు బూస తవుడు, రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, డొంక అన్నపూర్ణ, తాడుతురి తిరుపతిరావు, డొంక వెంకటరమణ, శ్రీను, పిఎసిఎస్ కార్యదర్శి పి.జ్ఞానేశ్వర్‌రావు, డొంక వెంకటరావు పాల్గొన్నారు.

**జియ్యమ్మవలస :** తాల్లడుమ్మ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్, మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, జనసేన మండల అధ్యక్షులు వారణాసి శివ కుమార్, కొప్పల వెలమ సాధికార సమితి అరకు పార్లమెంటు అధ్యక్షులు ఎం.సత్యంనాయుడు, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, జోగి భుజంగరావు, టిడిపి సీనియర్ నాయకులు దాసరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లానే లక్ష్యం

### కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాచిపెంట.. కెజిబివిలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిడిపిఒ అనంతలక్ష్మి

ప్రజాశక్తి-పార్వతీపురం

బాల్య వివాహాల రహిత జిల్లా లక్ష్యం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ, అప్‌హోల్డ్ సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 నాటికి పార్వతీపురం మన్యం జిల్లా బాల్యవివాహాల రహిత జిల్లాగా రూపాంతరం చెందుటకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చిన్నారులకు బాల్యవివాహాలు చేయకుండా తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

**కురుపాం :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం నుండి కురుపాం ప్రధాన రహదారి వరకు బాల్య వివాహాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జి.రమేష్ బాబు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఐసిడిఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

**పార్వతీపురంరూరల్ :** బాల్య వివాహాలను రూపుమాపేందుకు అందరూ కట్టుబడి ఉండాలని ఎంపిడిఒ కె.రూపేష్ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలన ప్రతిజ్ఞను అధికారులతో చేయించారు. కార్యక్రమంలో ఎపిఒ ఎస్‌విఎ కృష్ణారావు, ఎపిఎం సన్నిబాబు, ఇఒపిఆర్‌డి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**పాచిపెంట :** బాల్య వివాహాల వల్ల నష్టాలపై కెజిబివి విద్యార్థినులకు ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి అవగాహన కల్పించారు. అనంతరం బాల్యవివాహాలపైన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ ఉషారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

**బలిజిపేట :** మండల కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఒ సులేఖ ఆధ్వర్యాన బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం.. ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వెలుగు, ఐసిడిఎస్ సిబ్బంది

# అంగన్వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలి

### కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సిడిపిఒలను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఆర్‌డబ్ల్యుఎస్‌కు నిధులు మంజూరు చేశామని, త్వరగా పనులు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీల్లో మౌలిక వసతుల కల్పన, బాల్య వివాహాల నిర్మూలన, పోషణ్ వాటిక నిర్వహణ, ప్రగతిపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు రంగులు వేయించి అందంగా తీర్చి దిద్దాలని ఇదివరకు ఆదేశాలు జారీచేశామన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రానికి నేమ్ బోర్డు, కేంద్రంలో అందమైన చిత్రాలు, లైటింగ్, ఫ్యాన్, వైట్ బోర్డు, ఆట పరికరాలు, పాఠ్యపుస్తకాలు, కుర్చీలు, నీటి సరఫరా, మరుగుదొడ్డి వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కేంద్రాల్లో పోషణ్ వాటిక అమలుకావాలని, ఇందుకు అవసరమైన విత్తనాలను సరఫరా చేస్తామని తెలిపారు. వాటిని పిల్లలు ఆహారంలో తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం, విద్యను అందించాలని సూచించారు. ప్రతి పిల్లాడినీ తల్లిదండ్రులు అంగన్వాడీకి శ్రద్ధతో పంపాలని, ఆ విధంగా అంగన్వాడీలు రూపుదిద్దుకోవాలని తెలిపారు. 18ఏళ్ల లోపు వయసు గల అమ్మాయిలను గుర్తించి, వారు చదువుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాల్య వివాహాలు ఎక్కడా జరగకుండా చూడాలన్నారు. వీటి నిర్మూలనకు బాలల సంరక్షణ అధికారి జిల్లాలో ఉన్నట్లు కలెక్టర్ గుర్తుచేశారు. 18 ఏళ్లలోపు అమ్మాయిలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి, వాటి నివారణకు, ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ ఒ.ప్రభాకరరావు, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి ఎంఎస్‌ఎంఇల సర్వే

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఎంఎస్‌ఎంఇల సర్వే ఈ నెల 29 నుంచి ప్రారంభం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఎంపిడిఒలను ఆదేశించారు. ఎంఎస్‌ఎంఇల సర్వేపై బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఒలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్, మండలాల పరిధిలో సర్వేలకు కమిషనర్లు, ఎంపిడిఒలు నోడల్ అధికారులని చెప్పారు. జిల్లా స్థాయిలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ నోడల్ అధికారిగా ఉంటారన్నారు. యాప్ ద్వారా వివరాలు సేకరించే విధానంపై గురువారం శిక్షణ ఇచ్చి, శుక్రవారం నుంచి సర్వే ప్రారంభించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ ఎం.వి.కరుణాకర్, సహాయ సంచాలకులు సీతారాం, ఐపిఒ ఖరీముల్లా, డిపిఒ టి.కొండలరావు, డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యంనాయుడు, మున్సిపల్ కమిషనర్లు జి.శ్రీనివాసరాజు, సర్వేశ్వర రావు, కార్మిక శాఖ సహాయ కమిషనర్ రామకృష్ణ, వాణిజ్య పన్నుల శాఖ ఉప కమిషనర్ డి. మోహనరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ డి.పురుషోత్తం పాల్గొన్నారు.

## స్వచ్ఛ సుందర పార్వతీపురానికి కృషి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణాన్ని స్వచ్ఛ సుందరంగా కృషి చేద్దామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 20వ వార్డు పరిధిలోని అగ్రహారం వీధిలో స్వచ్ఛ సుందర పార్వతీపురం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి మాట్లాడుతూ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపాలిటీ సిబ్బందికి అందజేయాలని స్థానికులకు సూచించారు. కమిషనర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు వాడడంతో అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. అనంతరం స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పకీరురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపకరణాల గుర్తింపు శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన శిబిరానికి 236 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి పరికరాలను అందించారు. ఈకార్యక్రమంలో ఆ శాఖ ఎడి కవిత, ఎంపిడిఒ విజయరంగారావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-పార్వతీపురం

పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. వైద్య అధికారులు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. ఎస్‌డిజి లక్ష్యాలు సాధించాలని ఆయన సూచించారు. ఆరోగ్య తనిఖీలు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. వసతిగృహాల్లో ఎటువంటి అనారోగ్య సంఘటనలు సంభవించకూడదని స్పష్టం చేశారు. ఎఎన్‌ఎంలు వారంలో రెండు సార్లు విద్యా సంస్థలను సందర్శించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో బ్లడ్ కంపోనెంట్, సీతంపేట, సాలూరులో బ్లడ్ బ్యాంకులు మంజూరైనట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో డిసిహెచ్‌ఎస్ బి.వాగ్దేవి, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, ఎపిఎంఐడిసి ఇఇ సూర్య ప్రభాకర రావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు టి.జగన్మోహనరావు, పద్మావతి, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, జిల్లా మలేరియా అధికారి వై.మణి, జిల్లా ఆర్అండ్‌బి అధికారి కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఎల్విన్‌పేట సిఐ హరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్నవారికి విద్యార్థులు దానం చేసిన రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సారథి ఒకేషనల్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి తుంబలి వినోద్ కుమార్ 24వ సారి, సాయి యూత్ సభ్యులు ఆమిటి సురేష్‌కుమార్ 13వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.శ్రీవరం, వైద్యులు రౌతు రవికుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు జి.హరిప్రసాద్, ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

# పార్కులో సౌకర్యాలు కల్పించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

డాక్టర్ సన్యాసిరాజు పార్కులో సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు.. అధికారులను కోరారు. బుధవారం పట్టణంలోని బెలగాంలో ఉన్న డాక్టర్ సన్యాసిరాజు పార్కును సిపిఎం బృందం సందర్శించింది. పార్కులో ఉన్న ప్రాథమిక సమస్యలను నాయకులు గుర్తించారు. వ్యాయామ పరికరాలు, పిల్లలు ఆడుకునే ఊయల మరమ్మతులకు గురికావడం, ఉన్న మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండడం, తాగడానికి మంచినీటి సౌకర్యం లేకపోవడం గుర్తించారు. అదే సమయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు పార్కుకు రావడంతో, గుర్తించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు బంకురు సూరిబాబు, పాకల సన్యాసిరావు పాల్గొన్నారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



వీరఘట్టం.. తూడి రైతు సేవా కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి

# ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

### సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-వీరఘట్టం

ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి రైతు సేవా కేంద్ర సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం మండలంలోని తూడి రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం అమ్మకాలపై అవగాహన కల్పించాలని ఆర్ఎస్‌కె సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంఆర్ఐ లక్ష్మునాయుడు, వ్యవసాయ అధికారి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

**పాలకొండ :** రైతులను ఇబ్బందులు లేకుండా చేయాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలో సింగన్నవలస రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యం పరిశీలించి, వెంటనే మిల్లర్లకు పంపించాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. ఎక్కడా, ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎఒ వాహిణి, సిడిఎస్ డిటి మల్లీశ్వరరావు ఉన్నారు.

## పెట్టుబడి తగ్గింపుపై ఆలోచించాలి

ప్రజాశక్తి-పాచిపెంట

రైతు దిగుబడి పెంచడంతోపాటు పెట్టుబడి తగ్గించే విషయంలో కూడా ఆలోచనలు చేయాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని బొబ్బిలివలస గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పండించే రైతులు రెండుసార్లు కాంప్లెక్స్ ఎరువులు వేస్తున్నారని, దీనివల్ల ఖర్చు అధికం అవుతుందని చెప్పారు. అంతేకాకుండా భూమిలో పోషకాల అసమతుల్యత ఏర్పడి జింకు వంటి సూక్ష్మ పోషకాల లభ్యత తగ్గిపోతుందని తెలిపారు. కూలీల కొరత ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు వాడాలని చెప్పారు. లేకుంటే కలుపు మందులను పూర్తిగా వాడకుండా ఉండడమే మంచిదన్నారు. దీనివల్ల భూమి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్‌కృష్ణ, ప్రకృతిసేద్య సిబ్బంది నర్సింగరావు, విజయ్, సుమలత పాల్గొన్నారు.

### కొసలిలో పొలం పిలుస్తోంది

**భామిని :** పత్తి నుంచి రైతులు మొక్కజొన్నకు పంట మార్పిడి చేయాలని వ్యవసాయ శాఖ ఎడి రత్నకుమారి సూచించారు. కొసలి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్లో జీరో టిల్లెజ్ మొక్క జొన్న పంట సాగు, ఆవశ్యకత, ఉపయోగాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, లాభాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఒ జయశ్రీ, సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ, విఎఎ నాగరాజు, తదితరులు ఉన్నారు.

## అప్పుల బాధతో ఇటుక వ్యాపారి ఆత్మహత్య

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని వెంగాపురం గ్రామానికి చెందిన ఇటుక వ్యాపారి కుమిలి రవి 45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సింహాచలం కథనం ప్రకారం.. మండలంలోని వెంగాపురం గ్రామానికి చెందిన రవి.. వ్యాపార, ఇతర అవసరాల నిమిత్తం వాడుకున్న అప్పులను తీర్చుకోలేక మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం గడ్డి మందు తాగాడు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు గుర్తింపు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేయగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బూర్జిగూడ గ్రామంలోని కళ్లంలో నూర్పిడి సమయంలో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. ఘటనా స్థలాన్ని బుధవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ ప్రమాదంలో పాలక కుజ్జి, బిడ్డిక మంగడ, అరిక అప్పన్నకు చెందిన వరిచేను కుప్పలు, ట్రాక్టర్ పూర్తిగా కాలినాట్లు గుర్తించామని వ్యవసాయశాఖ ఎడి రత్నకుమారి తెలిపారు. నష్టం నమోదు చేసి, వివరాలను జిల్లా అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, సాంకేతిక వ్యవసాయ అధికారి మన్మథరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణారావు ఉన్నారు.

## మాదలింగిలో కంటి వైద్య శిబిరం

**కొమరాడ :** మండలంలోని మాదలింగి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి మాట్లాడుతూ కంటి పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామని, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు రమేష్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.